క్లుప్తంగా

రెండు లారీలు ఢీ-నిలిచిన ట్రాఫిక్



క్రేన్ సాయంతో కెమికల్ ట్యాంకర్‌ను తొలగిస్తున్న పోలీసులు

సంతమాగులూరు (అద్దంకి): కెమికల్ లారీని ఇసుక టిప్పర్ ఢీకొన్న ఘటన పాతమాగులూరు వద్ద శుక్రవారం జరిగింది. ఈ ఘటనలో లారీలు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న సంతమాగులూరు ఎస్సై శివ కుమార్ అక్కడికి చేరుకుని ఆరు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు. మరో వైపు క్రేన్ సాయంతో లారీని రోడ్డులో నుంచి తొలగించారు. కెమికల్ లీక్ కాకపోవడంతో పోలీసులు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో దీంతో పెను ప్రమాదం తప్పినట్లైంది.

మల్లీశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

అద్దంకి: దక్షిణ కాశీగా పేరుగాంచిన మణికేశ్వరం మల్లీశ్వరస్వామి దేవస్థానంలోని హుండీలను శుక్రవారం దేవదాయశాఖ అధికారులు లెక్కించారు. హుండీల ద్వారా రూ.20,422 వచ్చినట్లు దేవస్థాన చైర్మన్ ఆదా లక్ష్మీదేవమ్మ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమాన్ని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పీ శైలేంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది శివ, సీహెచ్ రామయ్య, సర్పంచ్ జంపు హరిబాబు పాల్గొన్నారు.

రాగి తీగ చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎస్సై సురేష్

చినగంజాం: రైతుల కోసం వ్యవసాయ విద్యుత్ నిమిత్తం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగను గుర్తుతెలియని దుండగులు దొంగిలించారు. విద్యుత్ ఏఈ గణనారాయణ వివరాల మేరకు.. మహాలక్ష్మి కాలనీలోని యానాది సంఘం వద్ద పర్వతరెడ్డి కృష్ణకుమారి, కుర్రి యానాది, శిఖరం చంద్రశేఖర్‌లకు చెందిన వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసిన 25 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగను శుక్రవారం వేకువ జామున గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఆయన తెలిపారు. దీని విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందన్నారు. చోరీపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై కే సురేష్ కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ



సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తున్న హెచ్‌ఎం

చినగంజాం: విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ ద్వారా క్రమశిక్షణ అలవరుతుందని చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డీ రత్నకుమారి అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఎన్‌సీసీ సర్టిఫికెట్ల ప్రదానోత్సవం నిర్వహించారు. 23వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ చీరాల పీఐ సిబ్బంది సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాలలోని 22 మంది విద్యార్థులకు ఏ గ్రేడ్ సర్టిఫికెట్, ఒక విద్యార్థికి బీ గ్రేడ్ సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి సీఎచ్ సుబ్బారావు, మాజీ ఎన్‌సీసీ అధికారి ఎస్ నరసింహారావు, హవల్దార్ గాలయ్య, హవల్దార్ సుభారాం, ఉపాధ్యాయులు శ్రీనివాస దీక్షితులు, సూర్యనారాయణ , శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దిశా యాప్‌పై అవగాహన

బల్లికురవ: ప్రభుత్వం ఆపద సమయంలో మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రవేశపెట్టిన దిశాయాప్‌లో 879 మంది చేత డౌన్‌లోడ్ చేయించినట్లు ఏఎస్సై సీ. బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 4 టీమ్‌లుగా బల్లికురవ, వేమవరం, మల్లాయపాలెం, వైదన జంక్షన్‌ల వద్ద పోలీస్ సిబ్బంది, సచివాలయ మహిళా సిబ్బందిచే లక్ష్యాలు పూర్తి చేసినట్లు ఎఎస్సై వివరించారు.

ఐసెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

అద్దంకి: ఏపీ ఐసెట్ ఫలితాల్లో అద్దంకికి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న వావిలాల తిలక్‌దత్త పురోహితం చేసుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. రాష్ట్ర స్థాయిలో 68 ర్యాంకు, జిల్లా స్థాయిలో ఒకటో ర్యాంకు సాధించాడు. పురోహితుడు అందరికి తెలిసిన విద్యార్థి కావడం, మంచి ర్యాంకు సాధించడంతో పట్టణ ప్రముఖులు, పెద్దలు అభినందనలు తెలియజేశారు. అదే విధంగా గర్రపాటి దుర్గ నేహ రాష్ట్ర స్థాయిలో 376 ర్యాంకు సాధించింది.



ఈ-క్రాప్ బుకింగ్, క్రాప్ బీమా నమోదు చేస్తున్న వీహెచ్‌ఏలు

రైతాలయాలు

- రైతు భరోసా కేంద్రాలు-అన్నదాతకు నేస్తాలు
- సొంతూరిలోనే ఎరువులు, విత్తనాలు
- సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో నాలుగేళ్లుగా విశేష సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు, ఉద్యోగులు
- కియోస్క్ యంత్రాలతో డిజిటల్ సేవలు

మండలంలోని గ్రామాలు	14
మండలంలోని ఆర్బీకేలు	12
ఆర్బీకేలో పనిచేస్తున్న సిబ్బంది	10
మొత్తం రైతులు	17645 (సుమారుగా)
రైతు భరోసా లబ్ధిదారులు	6706
పొందిన లబ్ధి	రూ. 36.88 కోట్లు
రాయితీపై ఎరువులు పొందిన రైతులు	4102
రాయితీలపై విత్తనాలు అందుకున్న రైతులు	2227
ఉద్యాన రాయితీలు పొందిన రైతులు	1125
వ్యవసాయ పనిముట్లు, యంత్ర పరికరాలు పొందిన రైతులు	225



రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందిస్తున ఏఓ, ఆర్బీకే సిబ్బంది (ఫైల్)

కారంచేడు: వ్యవసాయమే దండగా అన్న ముఖ్యమంత్రులను చూశాం.. పట్టెదన్నం పెట్టే రైతన్నలను గాలికొదిలేసి కాంక్రీట్ బిల్డింగులు, ఆకాశ హార్మ్యాలే అన్నం పెడతాయని ఊదరగొట్టిన ప్రభుత్వాలను చూశాం. ఏళ్లకే ఏళ్లు రైతన్నలు వ్యవసాయం కలిసిరాక దీనస్థితిలో ఉండిపోయారు. సరిగా అప్పుడొచ్చాడు నేను ఉన్నాను.. నేను విన్నాను అన్న ఒక్క మాటతో ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని ఘంటాపథంగా నమ్మాడు. వెంటనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతన్నల ముంగిటకే సేవలు అందించేలా చేశాడు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, ఈ-క్రాప్ బుకింగ్, రైతు భరోసా, యంత్ర పనిముట్లు ఇలా ఒకటేమిటి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసి రైతు బాంధవుడు అయ్యాడు సీఎం జగన్. ఇది రైతు ప్రభుత్వం.. రైతు సేవతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నమ్మిన ఏకైక సీఎం. దీంతో రైతన్నలు నాలుగేళ్లలో గిట్టుబాటు ధరలతో, పంట నష్టపోతే పరిహారంతో అందుకుని సంతోషంగా ఉన్నారు.

ఆర్బీకేల ద్వారా ఎరువులు, పురుగు మందులు..

కింది ఫొటోలో ఉన్న రైతు పేరు జెట్టి సురేష్, కుంకలమర్రు గ్రామం. వరి పంటను ప్రధానంగా సాగు చేస్తుంటాడు. గతంలో ప్రకృతి విపత్తులు వచ్చి పంట నష్టం జరిగితే పరిహారం అందక చాలా ఇబ్బందులు పడేవారు. ఎప్పుడు వస్తుందో తెలియక వదిలేసేవారు. కాని ప్రస్తుత ప్రభుత్వంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆర్బీకేల ద్వారా ఈ-క్రాప్ బుకింగ్‌ను ప్రవేశపెట్టాడు. దీని ద్వారా నష్ట పరిహారం, మంచి గిట్టుబాటు ధరలు పొందాడు. నేను ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు ఏమి కొనాలన్నా ప్రైవేటు షాపుల్లో అధిక ధరలకు కొనే పరిస్థితులుండేది. ఇప్పుడు ఆర్బీకేల ద్వారా అన్నీ ఎమ్మార్పీలకే అందుబాటులో దొరుకుతున్నాయి. ఈవ్యవస్థ చాలా సదుపాయంగా, సంతోషంగా ఉందని చెప్పాడు.



ఆర్బీకేల్లో ప్రత్యేక సిబ్బంది..



ఈపక్క ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు తేళ్ల చినవెంకటయ్య. బీఎస్సీ వరకు చదివి కొంత కాలం ప్రైవేటు ఉద్యోగం చేశాడు. ఇక జీవితంలో ప్రభుత్వ ఉద్యోగం రాదని నిరాశ పడ్డాడు. కాని జగనన్న ప్రభుత్వ దయతో వ్యవసాయ శాఖకు అనుసంధానంగా తిమిడెదపాడు ఆర్బీకేలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించానని సంతోషం వ్యక్తం చేశాడు. గతంలో చేసిన ఉద్యోగానికి భరోసా లేదు. ఇప్పుడు మాకు ధైర్యంగా ఉంది. జాబ్ సెక్యూరిటీ ఉంది. ప్రతి నెలా వేతనాలు, కుటుంబ పోషణకు భారం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మాలాంటి అనేక మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయి.. జగనన్నకు మేము రుణపడి ఉంటామని భావోద్వేగానికి గురయ్యాడు.

గిట్టుబాటు ధరతో రైతుల్లో ఆనందం..



స్వర్ణ గ్రామానికి చెందిన ఈ రైతు పేరు నీరుకట్టు రాంబాబు. ఈయన ప్రతి ఏటా వరి, శనగ, మిరప పంటలు సాగు చేస్తుంటాడు. ఈయనకు నాలుగేళ్లుగా ప్రభుత్వం అందించే రైతు భరోసా నగదు జమవుతోంది. పండించిన పంటను గతంలో దళారుల ద్వారా అమ్మకాలు చేసేవాడు. కొంత వారికి కమీషన్లు ఇవ్వాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వమే ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తుండటంతో ఎలాంటి కమీషన్లు లేకండానే తన సొమ్ము తన బ్యాంక్ ఖాతాకు నేరుగా జమ అవ్వడంతో సంతోషంగా ఉన్నాడు.

ఈ-క్రాప్ బుకింగ్‌తో పంట నష్ట పరిహారం..

ఈకింది ఫొటోలో ఉన్న రైతు పేరు బోడావుల శ్రీనివాసరావు, తిమిడెదపాడు గ్రామం. గతంలో పంట నష్టపోతే మీ సేవా కేంద్రాలకు వెళ్లి నష్టపరిహారం రాయించుకున్నా డబ్బులు పడేదాక వారి చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈ నాలుగేళ్ల పాలనలో ఆర్బీకే సిబ్బంది రైతు దగ్గరకు వచ్చి వాళ్లే ఈ-క్రాప్ బుకింగ్ చేశారు. అంతేకాకుండా పంటలకు బీమా కూడా చేయించారు. దీంతో గత రెండేళ్లుగా మిరప, పత్తిలో నష్ట పరిహారం, బీమా పొందానని సంతోషంగా చెప్పాడు. ఆర్బీకేలు నూటికి నూరు శాతం ఉపయోగంగా ఉంటున్నాయి. రైతులకు ఎంత మేలు చెయ్యాలో అంత మేలు జరుగుతోంది. ప్రభుత్వానికి నా ప్రత్యేక ధన్యవాదాలని చిరునవ్వుతో చెప్పాడు.



పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న వెంకటేష్

- నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

వేటపాలెం: పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. వేటపాలెం మండల పరిధిలోని అక్కాయిపాలెం పంచాయతీ ఎస్టీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అధికారులు, నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు తెలియజేశారు. పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. పరిష్కారం కాని సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కాలనీలో ఎటువంటి సమస్యలు ఉన్నా తమను నేరుగా కలసి చెప్పవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఎస్ శర్మ, చీరాల మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, ఆర్‌బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, జంగిలి రామారావు, తులసి, బాబీ, కోటేశ్వరరావు, బొడ్డు సుబ్బారావు, ఏపీఎం శ్రీనివాసులు, ఆర్‌బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, గోలి గంగాధర్, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ఇంటింటా సంతోషం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

సంతమాగులూరు (అద్దంకి రూరల్): జగనన్న పాలనలో నవరత్నాల అమలుతో ప్రతి ఇంటా సంతోషంగా ఉన్నారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పాతమాగులూరు గ్రామంలోని ఎస్టీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి పథకాలు అందించలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దేశంలో నెంబర్‌న్ సీఎంగా పేరు తెచ్చుకున్నారన్నారు. జగనన్నకు ప్రజల్లో విశేషమైన ఆదరణ లభిస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలవాలని లబ్ధిదారులను కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్, జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, కార్పొరేషన్ డైరక్టర్లు, సొసైటీ అధ్యక్షులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఆటో నుంచి జారిపడి మహిళకు గాయాలు

కారంచేడు: ఆటో నుంచి జారిపడి మహిళ స్వల్ప గాయాలయ్యాయి. ఈఘటన వాడరేవు-పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో కారంచేడు-చీరాల గ్రామాల మధ్యన ఉన్న పెద్ద చర్చి సమీపంలో శుక్రవారం జరిగింది. ఎస్సై జీ శ్రీనివాసరావు వివరాల మేరకు.. మండలంలోని కుంకలమర్రు ప్రాంతానికి చెందిన మహిళ చెత్త కాగితాలు ఏరుకొని వాటిని మూటలు కట్టుకొని చీరాలకు తీసుకెళ్లి అమ్ముకొని జీవనం సాగిస్తుంటుంది. ఈ క్రమంలో శుక్రవారం చిత్తు కాగితాల మూటలతో ఉన్న ఆటో కుంకలమర్రు నుంచి చీరాలకు బయలుదేరింది. మార్గమధ్యంలో చర్చి వద్దకు వచ్చే సరికి బలమైన ఈదురుగాలులు వీయడంతో ఆటో ఉన్న మహిళ కింద పడిపోయింది. స్వల్పగాయాలైన మహిళను 108లో చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

దొంగ ఓట్లు తొలగిస్తే టీడీపీకి భయమెందుకు



దొంగ ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మార్టూరు: ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనది.. అలాంటి ఓటును దొంగనోట్ల సంస్కృతికి తెరతీసి గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని మండల వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మార్టూరు గ్రామంలో 19 బూతుల్లో 15400 మంది ఓటర్లు ఉన్నారని పరిశీలనలో 2014, 2019 ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీ నాయకులు మూడువేలు దొంగ ఓట్లు చేర్పించినట్లు తాము గుర్తించామన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ఆదేశాల మేరకు 19 బూత్‌ల వారీగా కమిటీలు నియమించి దొంగ ఓటర్లను గుర్తించామని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నియమావళిని అనుసరించి అధికారులే తగు చర్యలు తీసుకుంటారన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తగుదనమ్మా అంటూ బూత్ లవారీ కమిటీలను తమ పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేయడం హాస్యాస్పదంగా ఉందని వారు ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కాకోలు రామారావు, స్థానిక నాయకులు పఠాన్ కాలేషావలి, భూక్యా బాబునాయక్, రాజా నాయక్, అట్లూరి సుకుందరావు, పుట్టా అయ్యప్ప, సకలా అంజనేయులు, సులేమాన్, గడ్డం మస్తాన్ వలి, కాకోలు నాగేశ్వరరావు, చినవెంకటేశ్వర్లు, ముప్పవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో సరోజిని

చీరాల: మండలంలోని రూరల్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆర్డీవో పి.సరోజిని పరిశీలించారు. వాడరేవు, బుర్లవారిపాలెం, పిట్టువారిపాలెం, గవినివారిపాలెం, కావూరివారిపాలెం, విజయనగర్‌కాలనీలోని పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని వసతులపై ఆమె ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తహసీల్దార్ జి.ప్రభాకరరావు, బీఎల్‌ఓలు, వీఆర్వోలు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

చీరాల: క్యాన్సర్‌తో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. నియోజకవర్గంలోని వేటపాలెంలో ఇటీవల క్యాన్సర్‌తో మృతి చెందిన ఉమ్మిటి తారక రామారావు కుటుంబానికి యడం చిన్నరోశయ్య ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం ఆయన కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇద్దరి ఆడపిల్ల చదువులకు సాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కర్ణ రమేష్, బుల్లిరెడ్డి, దేవాంగ సంక్షేమ సంఘ పెద్దలు కె.రాహుల్జి, బండ్ల బాబు, బి.శ్రీను, చింత రాము, జి.సుబ్బనాగులు, మాచర్ల బ్రహ్మం, పి.ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మమత

చీరాల: అన్ని వర్గాల ప్రజలకు అన్ని ఆరోగ్య సమస్యల నివారణకు రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని హాస్పిటల్స్ డిప్యూటి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత అన్నారు. శుక్రవారం స్థానిక బాలశంకరరావు హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరంలో ఆమె మాట్లాడారు. గుంటూరులో ఉన్న హాస్పిటల్స్‌కు రావాలంటే వ్యయప్రయాసలవుతాయని, ఆదివారం తమ వైద్యశాలలోని వివిధ విభాగాలకు చెందిన వైద్యనిపుణులచే ఉచిత వైద్యశిబిరాన్ని బాలశంకరరావు హాస్పిటల్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఆయా ఆరోగ్య సమస్యలు ఉన్నవారు పరీక్షలు చేయించుకుని మందులు తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత



జేవీడీ కిట్‌లు అందిస్తున్న జెడ్పీటీసీ తిరుమలాదేవి

వేటపాలెం: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని జెడ్పీటీసీ బండ్ల తిరుమలాదేవి పేర్కొన్నారు. చల్లారెడ్డిపాలెం పంచాయతీ కొణిజేటి చేనేతపురి కాలనీలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల్లో జగనన్న విద్యా కానుక కిట్‌లు, సామూహిక అక్షరాస్యత కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అనంతరం పాఠశాలల్లో సరస్వతీదేవి పూజచేసి అక్షరాభ్యాసం చేయించారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు డేటా ప్రేమసాగర్, జే అరుణ, ఎస్ అన్నపూర్ణలను ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో బుర్రా సాంబశిరావు, టీ కాశీచంద్, ఖాదరున్నిసా, ఎం అరుణ, ఎం శ్రీనివాసరావు, పి జ్యోతి, డీబీ కరుణశ్రీ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల దాడులు

మార్టూరు: మండలంలోని ద్రోణాదుల, కోలలపూడి, తాటి వారిపాలెం గ్రామాల్లో ఒంగోలు విద్యుత్ శాఖకు చెందిన విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. అందులో భాగంగా నాలుగు విద్యుత్ చౌర్యం కేసులు, 10 అడిషనల్ డిపాజిట్ కేసులు గుర్తించి కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ డీఈ టీ హైమావతి తెలిపారు. కార్యక్రమంలో ఇతర విజిలెన్స్ శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లాయర్ల సంక్షేమానికి ప్రభుత్వ కృషి అభినందనీయం



కృష్ణచైతన్యకు పుష్పగుచ్ఛం ఇస్తున్న లాయర్లు

అద్దంకి రూరల్: లాయర్ల సంక్షేమానికి రాష్ట్ర సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని అద్దంకి వైఎస్సార్ సీపీ న్యాయవిభాగం నేతలు అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్యను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు లాయర్లు పాల్గొన్నారు.

ప్రాధాన్యత భవనాలకు రూ.1.16 కోట్లు చెల్లింపులు

బల్లికురవ: ఉపాధిహామీ పథకంలో మండలంలో నిర్మాణం పూర్తి చేసిన ప్రాధాన్యత భవనాలకు రూ. 1.16 కోట్లు చెల్లింపులు పూర్తి చేసినట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ శుక్రవారం తెలిపారు. 20 సచివాలయాల పరిధిలో వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, ఆర్బీకేలు, సచివాలయాలు, ప్రహరీలు, సీసీ రోడ్లకు సంబంధించి సుమారు రూ. 2 కోట్ల పైచిలుకు పనులను కాంట్రాక్టర్లు పూర్తిచేశారని చెప్పారు. వీటికి సంబంధించి ఎంబుక్ రికార్డింగ్ పూర్తిచేసుకుంటే బిల్లు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎంపీడీవో వివరించారు.

రైతులకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి



రైతులతో ఎమ్మెల్యే కరణం

వేటపాలెం: ప్రభుత్వం రైతులకు ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. చీరాల క్యాంపు కార్యాలయంలో కొత్తపేట పంచాయతీ ఒడ్డె సంఘం రైతులు ఎమ్మెల్యేని మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చిన తమ వద్దకు రావాలని సూచించారు. ప్రభుత్వం రైతుల కోసం ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందన్నారు. శివయ్య, సుబ్బారావు, సుబ్బారావు, ఓడల శ్రీను, రామసుబ్బారావు పాల్గొన్నారు.

మోటారు బైకును ఢీకొన్న ట్రాక్టర్

మేదరమెట్ల: రాంగ్‌రూట్‌లో వచ్చిన ట్రాక్టర్ మోటారు బైకును ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈఘటన బొడ్డువానిపాలెం రాష్ట్రీయ రహదారిపై శుక్రవారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన భీమనాథం సాంబిరెడ్డి మోటార్ బైకుపై బొడ్డువానిపాలెం గ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో సాంబిరెడ్డి తలకు తీవ్రగాయాలు కాగా ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించినట్లు స్థానికులు తెలిపారు. మేదరమెట్ల పోలీసులకు సమాచారం అందడంతో ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.